రంజాన్ వేళలు	ఇఫ్తార్ (ఆది)	సా.6.20
	సహరి (సోమ)	ఉ.4.54

లారీని ఢీకొని యువకుడి మృతి

- ఎక్సైజ్ అధికారులు వెంటపడడంతో ప్రమాదం జరిగినట్టు బంధువుల ఆరోపణ
- సుంకరపాలెం ఎక్సైజ్ చెక్‌పోస్టు ముట్టడి

7



కాకినాడలోని కళాక్షేత్రం వద్ద మహిళా దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ



మహిళా దినోత్సవ కార్యక్రమానికి హాజరైన ప్రజలు



కాకినాడలోని స్వయం సహాయక సంఘాలకు విడుదలైన నిధుల చెక్‌ను అందజేస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఎమ్మెల్యేలు కొండబాబు, చినరాజప్ప

మహిళలు.. పారిశ్రామిక, వ్యాపారవేత్తలుగా ఎదగాలి

- అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ
- కాకినాడలో ఘనంగా మహిళా దినోత్సవ కార్యక్రమం





కార్యక్రమంలో మహిళకు స్వీట్ తినిపిస్తున్న మంత్రి నారాయణ.. మరో మహిళకు కిట్ అందజేస్తూ..

కాకినాడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామిక, వ్యాపారవేత్తలుగా ఎదగాలని, మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాకినాడ రాజాట్యాంక్ ప్రాంగణంలోని కళాక్షేత్రంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, డీఆర్‌డీఏ మెప్మా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.

'పురుషులతో సమానంగా అవకాశాలు'

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణ హాజరై మాట్లాడారు. మహిళల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, మహిళలకు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అవకాశాలు ఇచ్చి సాధికారిత కల్పిస్తోందని అన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళలు చిన్న చిన్న వృత్తులు చేయడం కాదని, గౌరవమైన వ్యాపారవేత్తలుగా ఎదగాలనే ఉద్దేశంతో ఇసుక రీచ్‌ల నిర్వహణను మహిళలకు అప్పగించి వారికి 25శాతం ఆదాయాన్ని ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రజలకు ఎన్డీఏ కూటమి చేసిన వాగ్దానాలను నెమ్మదిగా నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని త్వరలో కల్పిస్తోన్నామన్నారు. డీఆర్‌డీఏ ద్వారా ఈ ఏడాది బ్యాంకు లింకేజీ ప్రోగ్రాం ద్వారా 558 మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.వంద కోట్ల మేర కల్పించామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చిన 20మంది మహిళలకు రూ.2.36కోట్లు ఆర్థిక సాయం అందించగా.. లక్‌పతీ దీదీ కింద 400మంది మహిళలకు రూ.4కోట్లు పంపిణీ చేస్తామన్నారు.

'విజ్ఞాపనలకు ప్రాధాన్యమివ్వాలి'

కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం సాధికారిత కోసం డ్రోన్ దీదీ, లక్‌పతి దీదీ వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. బదిలీలు వంటి అంశాల్లో మహిళా ఉద్యోగుల విజ్ఞాపనలకు సానుకూలమైన ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన పాల్గొని మాట్లాడారు. సమాజ నిర్మాణం, ప్రగతిలో మహిళల స్ఫూర్తిదాయకమైన భూమిక, వారి సాధికారిత, స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా కేసుకు కట్ చేశారు. డీఆర్‌డీఏ, మెప్మాల ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను పంపిణీ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటలపోటీలు, విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృతం, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు మంత్రి నారాయణ బహుమతులు అందజేశారు. ర్యాపిడో సంస్థ సమన్వయంతో బ్యాంకు రుణాలతో 25మంది యువతులకు ఎలక్ట్రికల్ వాహనాలను పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ, మెప్మా, ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.



కాకినాడ నగరపాలక సంస్థలో కలెక్టర్ షాన్‌మోహన్, కార్పొరేషన్ కమిషనర్ భావన, కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబుతో కలిసి నగరపాలక సంస్థ, కౌడాపై సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

నిర్మాణ అనుమతులు త్వరితగతిన మంజూరు చేయండి

- కాకినాడ నగరపాలక సంస్థ, కౌడా పనితీరుపై మంత్రి నారాయణ సమీక్ష
- ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్ పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిశీలించాలని సూచన

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 8(ఆంధ్రజ్యోతి): లే అవుట్లు, బిల్డింగ్ నిర్మాణ అనుమతుల కోసం కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా), కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖా మంత్రి పి.నారాయణ సూచించారు. కాకినాడ నగరానికి విచ్చేసిన ఆయన కాకినాడ నగరపాలక సంస్థ, అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో కాకినాడ శారదమ్మగుడి సమీపంలో ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, కమిషనర్ భావనతో కలిసి టౌన్‌ప్లానింగ్ విభాగంపై సమీక్షించారు. నగరపాలక సంస్థ, కౌడా పరిధిలో కన్వర్షన్ ఆఫ్ ల్యాండ్స్, లే అవుట్స్, బిల్డింగ్ ప్లాన్స్ అనుమతులపై ఆరా తీశారు. ఎన్నింటికి అనుమతులుఇచ్చారు. ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి వంటి వివరాలను ఆరా తీశారు. పెండింగ్‌లో ఉండడానికి కారణమేంటని ప్రశ్నించారు. ఆసమయంలో నగరపాలక సిటీ ప్లానర్ ఇచ్చిన సమాధానాలపై అసంతృప్తి చెందారు. రాష్ట్రస్థాయి అధికారులతో ఆయన నేరుగా టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఆయన కాకినాడ నగరపాలక సంస్థ వివరాలను అడిగి తెలుసుకున్నారు. టౌన్‌ప్లానింగ్,కౌడా ద్వారా ఇన్‌కమ్ జనరేట్ చేసుకోవాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌కు సంబంధించి కౌడాలో పెండింగ్‌లో ఉన్న 976 దరఖాస్తులను, నగరపాలక సంస్థలో పెండింగ్‌లో ఉన్న 204దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్ గడువును ఆరు నెలలు పెంచాలని సూచించారు. లేఅవుట్స్‌కు నాలుగు రోజుల్లో, బిల్డింగ్ పర్మిషన్స్ రెండురోజుల్లో ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులను పిలిచి మాట్లాడాలని కమిషనర్ భావనకు సూచించారు. దీనిపై మరోసారి సమీక్షిస్తానని మంత్రి వెల్లడించారు. ఈ సమీక్షలో కాకినాడ నగరపాలక అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.





క్యాంప్‌ఫైర్‌లో పాల్గొన్న మహిళా ఉద్యోగినులు.. ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఇతర ఉన్నతాధికారిణులు

ముగిసిన మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు

- ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- విజేతలకు బహుమతుల అందజేత
- ఉత్సాహంగా క్యాంప్ ఫైర్

కలెక్టరేట్(కాకినాడ),మార్చి8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులకు అదనంగా సెలవులు మంజూరు కోసం పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. జిల్లా క్రీడామైదానంలో ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగినులకు నిర్వహించిన క్రీడాపోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగినులకు అదనంగా సెలవులు ఇస్తే వారి పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు మరింత సమయం లభిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ తాము ఇచ్చిన రెండురోజుల స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మహిళలు ఉపయోగించుకుని ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.అనంతరం మహిళలు ఉత్సాహంగా క్యాంప్ ఫైర్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, కార్యదర్శి వెంకటకృష్ణ, పసువులేటి శ్రీనివాస్, మీనాక్షి, దేవి, సుజాత పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్

ఆవిర్భావ సభకు పకడ్బందీగా ఏర్పాట్లు

జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల.. చిత్రాడలో ఏర్పాట్ల పరిశీలన



పిఠాపురం మండలం చిత్రాడ శివారులో జనసేన ఆవిర్భావ సభా ప్రాంగణం.. (ఇన్‌సెట్)లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు వచ్చే ఏఒక్కరూ ఇబ్బంది పడకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. సభాప్రాంగణం, వచ్చే మార్గాలు, బారికేడ్ల ఏర్పాటు తదితరాలను పరిశీలించి కార్యక్రమాల నిర్వహణ కమిటీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచే గాక దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. అనంతరం జరుగుతున్న ఏర్పాట్లపై కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాస్ తదితరులతో సమీక్ష నిర్వహించారు. శాసన మండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, శాసనసభలో ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు.

సభకు చకచకా ఏర్పాట్లు

జనసేన ఆవిర్భావసభకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభకు తరలివచ్చే లక్షలాది మందికి ఇబ్బంది కలుగకుండా ఉండేలా సభావేదిక, ప్రాంగణం, వచ్చే మార్గాల ఏర్పాటు పనులు సాగుతున్నాయి. వాహనాల పార్కింగ్‌కు ఐదు ప్రాంతాలను గుర్తించారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారులోని ఎస్‌బీ వెంచర్స్ ఆవరణ ఈనెల 14న జరిగే జనసేన 12 ఆవిర్భావ వేడుకలు, సభకు సిద్ధమవుతోంది. సభా ప్రాంగణాన్ని చదును చేసే పనులు చివరి దశకు చేరాయి. ప్రస్తుతం బారికేడింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సభావేదికకు వచ్చే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. 20 ఎకరాల విస్తీర్ణంలో సభ జరగనుంది. వీవీఐపీలు, వీఐపీలు, మహిళలు, పురుషులు సభా ప్రాంగణంలోని వచ్చేందుకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆవిర్భావ సభకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాలు, విదేశాలనుంచి వచ్చే జనసేన నాయకులు, ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులు, జనసైనికులు, వీరమహిళలు ఇబ్బంది పడకుండా వీటి ఏర్పాటు సాగుతోంది. ఆవిర్భావ సభ వేదిక ఎకరం విస్తీర్ణంలో వేదిక నిర్మించనున్నారు. సభా ప్రాంగణానికి 500మీటర్ల దూరంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. హెలికాప్టర్ దిగిన తర్వాత పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా సభావేదికపైకి చేరుకుంటారు.

సాగునీరివ్వాలని..
రైతుల ధర్నా



తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ జైభీమ్‌పేట వంతెనపై ధర్నా చేస్తున్న రైతులు

తాళ్లరేవు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండలం పి.మల్లవరం శివారు గ్రాంటు పొలాలకు సాగునీరు అందించాలని కోరుతూ రైతులు జైభీమ్‌పేట 216 జాతీయ రహదారిపై శనివారం ధర్నా నిర్వహించారు. రహదారిపై రైతులు 15నిమిషాలపాటు ధర్నా చేయడంతో కాకినాడ-అమలాపురం రహదారిలో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయి వాహనాలు స్తంభించాయి. శనివారం సెలవుదినం కావడంతో ఇరిగేషన్ కార్యాలయం వద్ద అధికారులు లేరు. కార్యాలయం మూసివేసి ఉంది. దీంతో రైతులు తమ బాధలు ఎవరితో చెప్పుకోవాలో తెలియక రోడ్డుపై ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న కోరంగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులతో చర్చించి ధర్నాను విరమింపజేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను తరలించారు.

ఆర్‌ఎంసీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థులతో ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం తదితరులు

జీజీహెచ్(కాకినాడ), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్యకళాశాల(ఆర్‌ఎంసీ)లో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఎంబీబీఎస్ చివరి సంవత్సరం వైద్యవిద్యార్థులబృందం జూనియర్లకు ఆహ్వానం పలికింది. 2024 బ్యాచ్‌కు చెందిన 250 మంది విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, డీఎంఈ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే ఘనత కేవలం వైద్యవృత్తిలో మాత్రమే ఉందన్నారు. తమ బిడ్డలను వైద్యుడిగా చూడాలనుకోవడం ఎంతోమంది తల్లిదండ్రుల కలఅన్నారు. విద్యార్థులు కూడా అకుంఠిత దీక్షతో చదివి శిక్షణలో రోగులతో సహనంగా మెలిగితే వారు చదివిన చదువుకు సార్థకత చేకూరుతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ మాట్లాడుతూ రంగరాయలో చదవిన వైద్యవిద్యార్థులు దేశ, విదేశాల్లో నిష్ణాతులైన వైద్యులుగా స్థిరపడి కళాశాల కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపచేశారన్నారు. వైద్యవిద్యలోకి నూతనంగా అడుగిడుతున్న విద్యార్థులు తమ భవిష్యత్తును బంగారు మయం చేసుకుని పేదలకు వైద్యసేవలను అందించాలని ఆకాంక్షించారు. ఈ ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పి.శ్రీనివాసన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 20,661మంది హాజరు

కాకినాడ రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 54 పరీక్షా కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర గణితం 1బీ, జంతుశాస్త్రం-1, చరిత్ర-1 పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 20,661మంది విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించిన పరీక్షలకు మొత్తం 21,352మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా జనరల్ విద్యార్థులు 18,991మంది, ఒకేషనల్ విద్యార్థులు 1670 మంది హాజరుకాగా రెండింటిలోనూ కలిపి 691 మంది పరీక్ష రాయలేదన్నారు. సోమవారం ద్వితీయ ఇంటర్ గణితం 2బీ, జంతుశాస్త్రం-2, చరిత్ర-2, ఒకేషనల్, ఓపెన్ స్కూల్ పరీక్షలు జరుగుతాయని డీఐఈవో తెలిపారు.

మహిళలకు మాత్రమే..



ఒక్కరోజు ఉచిత బోటు ప్రయాణం

యానాం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వం పుదుచ్చేరిలోని మహిళలకు ఒక్కరోజు ఉచిత బోటు ప్రయాణం కల్పించింది. పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి ఆదేశాల మేరకు పర్యాటకశాఖ ఆధీనంలో ఉన్న బోట్‌హౌస్‌లో ఈ సౌకర్యం కల్పించారు. దీంతో యానాం పర్యాటకశాఖ ఆధీనంలోని సీగల్స్ బోటుహౌస్‌లో మహిళలకు ఉచిత బోటు షికారు అవకాశం కల్పించారు. పలువురు మహిళ న్యాయవాదులు, టీచర్లు, ప్రజలతో పాటు బీచ్ పర్యాటనకు వచ్చిన మహిళలు యానాం గౌతమీ గోదావరిలో బోటులో విహరించారు. కార్యక్రమాన్ని యానాం పరిపాలనాధికారి మునిస్వామి,సీగల్స్ మేనేజర్ మురళీధరన్ పర్యవేక్షించారు.


యానాం గోదావరి బోటులో విహరిస్తున్న మహిళలు

14న పండుగలా జనసేన ఆవిర్భావ సభ

కాకినాడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభను కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం చిత్రాడ గ్రామంలో ఈనెల 14న పండుగలా నిర్వహిస్తామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. సభకు వచ్చేవారికి ఏవిధమైన ఇబ్బందులు రాకుండా చూసుకునేందుకు వివిధ కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఈ కమిటీలకు ఎప్పటికప్పుడు సమన్వయం చేసేందుకు కాకినాడలోని కుళాయి చెరువు ప్రాంగణంలో ఉన్న గోదావరి కళాక్షేత్రంలో కంట్రోల్ రూమ్‌ను మంత్రి నాదెండ్ల శనివారం ప్రారంభించారు. ఆవిర్భావ సభకు వచ్చే ఇరు రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల జన సైనికులు, వీరమహిళలు నాయకులు, పవన్‌కల్యాణ్ అభిమానులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఎప్పటికప్పుడు ఈ కంట్రోల్ నుంచి తమ అధి నాయకుడు పవన్‌తో సహా అందరూ పర్యవేక్షిస్తారన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ ఇప్పుడిప్పుడే రాక్షక పాలన నుంచి విముక్తి చెంది ఊపిరి పీల్చుకుంటున్నారన్నారు. తమ పార్టీ ఆవిర్భావ సభ ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలుస్తుందన్నారు. పార్టీలో ఉన్న ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి శ్రమిస్తున్నారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత 13ఏళ్లలో పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కరినీ గుర్తుపెట్టుకుని సముచిత న్యాయం చేస్తామన్నారు. సభకు 10 నుంచి 15లక్షల మంది కార్యకర్తలు, అభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గ ప్రజలు పవన్‌కు అద్భుతమైన విజయాన్ని అందించారని, ఈ సభలో వారికి కృతజ్ఞతలు తెలియజేస్తామన్నారు. విచ్చేసే అభిమానులు, కార్యకర్తలు, నాయకులందరికీ ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకూడదనే లక్ష్యంతో 14 కమిటీలు ఏర్పాటు చేశామని, అవి నిరంతరం పర్యవేక్షిస్తాయన్నారు. సభలో భవిష్యత్తు కార్యాచరణపై అభివృద్ధి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఇతర ఎమ్మెల్యేలు బత్తుల బలరామ కృష్ణ, నిమ్మల జయకృష్ణ, లోకం మాధవి, కొత్తపల్లి సుబ్బారాయుడు, సివిల్ సప్లై ఛైర్మన్ తోట సుధీర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొన్నారు.


కాకినాడలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌ల ఏర్పాటు

మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ

కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో భూముల పరిశీలన


బలభద్రపురంలో స్థల వివరాలను తెలుసుకుంటున్న మంత్రి

బిక్కవోలు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా మున్సిపాలిటీల నుంచి వచ్చే చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. దీనిలో భాగంగా ప్లాంట్ నిర్మాణం కోసం తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరం శివార్లలో జిల్లా పరిషత్‌కు సంబంధించిన 12 ఎకరాల భూములను, బలభద్రపురంలోని ఏపీ ఇండస్ట్రియల్ భూములు 34 ఎకరాలను ఆయన శనివారం పరిశీలించి మాట్లాడుతూ రాజమహేంద్రవరం- కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు చుట్టు పక్కల మున్సిపాలిటీల నుంచి చెత్తను కొత్తగా ఏర్పాటు చేసే ప్లాంట్‌కు తరలించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా ప్లాంట్ ఏర్పాటుకు బలభద్రపురం, కాపవరం గ్రామాల్లోని జడ్పీ, ఏపీ ఇండస్ట్రియల్ భూములను పరిశీలించినట్టు చెప్పారు. ప్లాంట్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులను తహశీల్దార్ సత్యకృష్ణ, రాజమహేంద్రవరం మున్సిపాలిటీ ఈఈ-2 మాధవిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటు చేసే క్రమంలో చుట్టు పక్కల మున్సిపాలిటీలకు అనుకూలంగా ఉండేలా స్థలాన్ని అన్వేషిస్తున్నామని, అందుకు మున్సిపల్ శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. సీఎం చంద్రబాబు ఆలోచనలతో స్వచ్ఛ ఆంధ్ర సాధన దిశగా కసరత్తు జరుగుతోందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే ప్లాంట్‌లో 20 మున్సిపాలిటీల నుంచి సేకరించిన వ్యర్థాల నుంచి సంపద సృష్టి, విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్టు మంత్రి నారాయణ వివరించారు.

సీతారామచంద్రస్వామి జీర్ణోద్ధరణ మహోత్సవంలో చిన్నజీయర్‌స్వామి



జీర్ణోద్ధరణ కార్యక్రమానికి విచ్చేస్తున్న చిన్నజీయర్‌స్వామి, ఉత్సవమూర్తుల విగ్రహాలను చూస్తూ...

సర్పవరం జంక్షన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సర్పవరంలో గత 3 రోజులుగా నిర్వహిస్తోన్న హనుమ, లక్ష్మణ సహిత శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహోత్సవ కార్యక్రమానికి శనివారం చిన్నజీయర్‌స్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా భీమవరం త్రిదండి చిన్న రామచంద్రజీయర్ స్వామి, గోవిందా జీయర్, త్రిదండి అహోబిల రామానుజజీయర్‌స్వాముల ఆధ్వర్యంలో స్వామి వారికి శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, చతు:స్థానార్చన, తత్త్వత్వ్యాస హోమం, యంత్రస్థాపన, బింబస్థాపన, నివేదన, పూర్ణాహుతి, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి వంటి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తుల సంప్రోక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం సమీపంలో ఉన్న శ్రీరాజ్యలక్ష్మి భావనారాయణస్వామి ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు, ఆలయ పురాతన విశిష్టతను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పురాణం వెంకటాచార్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జీర్ణోద్ధరణ మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా శ్రీనారసింహ ఇష్టి, చతు:స్థానార్చన, గోపూజ, సుందరకాండ పారాయణ, దివ్య ప్రబంధ పారాయణం, సంక్షేప రామాయణ హవనం, మూల మంత్ర, మూర్తి మంత్ర హవనాలు, పూర్ణాహుతి, మంగళాశాసనం వంటి పూజలు జరిగాయి.

రాజీమార్గమే రాజ మార్గం

పీడీజే గంధం సునీత


ఇన్సూరెన్స్ కంపెనీ పరిహార చెక్కు నమూనాను బాధితులకు అందజేస్తున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజ మార్గమని.. తద్వారా కేసులను పరిష్కరించుకుంటే కోర్టులపై భారం తగ్గుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాజమహేంద్రవరం డీఎల్ఎస్ ఏలో లోక్ అదాలత్‌ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలో సుమారు 80 వేల కేసులు పెండింగ్‌లో ఉండగా ఈ దఫా 10 వేల కేసులను లోక్ అదాలత్‌కి తగినవిగా గుర్తించామని, వాటిలో 5916 కేసులు పరిష్కరించినట్టు చెప్పారు. కక్షిదారులకు కోర్టు ఫీజులను కూడా తిరిగివ్వడం జరుగు తుందన్నారు. ప్రజల్లో లోక్ అదాలత్‌పై మరింతగా అవగాహన పెంచడం ద్వారా సత్వర న్యాయం జరిగేలా చూడడం సామాజిక బాధ్యత అని పీడీజే పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 42 న్యాయపీఠాల ద్వారా రూ.18.33 కోట్ల పరిహారానికి సంబంధించి అవార్డు అందజేశామన్నారు. కార్యక్రమంలో 1వ ఏడీజే ఆర్.శివ కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ ఉన్నారు.

ఆకట్టుకున్న 'ఎడారిలో వాన చినుకు'

గొల్లప్రోలు రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చిన్నచూపు చూస్తున్నారు నేటి తరం పిల్లలు. ఆప్యాయతలు కనుమరుగవుతున్నాయి. అటువంటి వారికి బుద్ధిచెప్పిన దంపతుల ఇతి వృత్తాన్ని ఎడారిలో వాన చినుకు నాటకం ద్వారా కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు కాకినాడ శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ కళాకారులు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అపర్ణాకళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటకాల పోటీల్లో భాగంగా తొలిరోజు ప్రదర్శించిన ఈ నాటకం అందరిని ఆకట్టుకుంది. ఈ నాటకాన్ని సారదా ప్రసన్న రచించగా, సీహెచ్ మహేష్ దర్శకత్వం వహించారు.


నాటకంలోని ఓ దృశ్యం

మహిళా దినోత్సవం రోజున.. మెడపై నరికేశాడు!

యువతిపై కత్తితో దాడి చేసిన యువకుడు


దాడిలో గాయపడిన యువతి

ముమ్మిడివరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం రోజున ఓ యువతిపై యువకుడు కత్తితో దాడి చేసి మెడపై నరికిన సంఘటన ముమ్మిడివరం మండలం అనాతవరంలో జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అనాతవరం ఎదురుమూడి పుంతలో పంతగంటి జయరామకృష్ణ, చాట్ల మాలతి పక్కపక్కన ఇళ్లల్లో ఉంటున్నారు. జయరామకృష్ణ వివాహితుడు కాగా భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మాలతి కూడా వివాహిత. భర్త బుల్లియ్య ఉపాధి నిమిత్తం ఏలూరులో చెరువుల వద్ద ఉంటున్నాడు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే శనివారం మధ్యాహ్నం మాలతి ఇంటి నుంచి బయటికి వెళ్తున్న సమయంలో చుట్టుపక్కల పిల్లలంతా ఆడుకుంటూ అల్లరి చేస్తుండగా వారిని ఆమె గట్టిగా మందలించింది. ఆ సమయంలో జయరామకృష్ణ ఇంట్లో నుంచి కత్తితో వచ్చి ఆమె మెడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అపస్మారక స్థితికి వెళ్లడంతో మాలతిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే గతంలో ఇరుగుపొరుగువారు ఎవరు గొడవ పడినా జయరామకృష్ణకు కిట్టేది కాదని, గట్టిగా మాట్లాడుకున్నా, గొడవపడినా ప్రశాంతంగా ఉండాలని వారిని హెచ్చరించేవాడని, ఈ క్రమంలోనే అల్లరిచేస్తున్న పిల్లలను మందలిస్తున్న మాలతిపై ఉద్రేకంతో కత్తితో మెడపై దాడి చేశాడని పోలీసులు పేర్కొంటున్నారు. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి ఇరుగుపొరుగువారిని విచారించి ఆధారాలు సేకరించారు. క్లూస్‌టీమును రప్పించి ఆధారాలు సేకరించారు. నిందితుడు జయరామకృష్ణను అదుపులోకి తీసుకుని దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మాలతి ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతుంది.


దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ మోహన్ కుమార్, ఎస్ఐ జ్వాలాసాగర్

లారీని ఢీకొని యువకుడి మృతి

ఎక్సైజ్ అధికారులు వెంటపడడంతో ప్రమాదం జరిగినట్టు బంధువుల ఆరోపణ

సుంకరపాలెం ఎక్సైజ్ చెక్‌పోస్టు ముట్టడి


లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం


మృతిచెందిన కోట శ్రీరామ్ (ఫైల్)

తాళ్లరేవు/జీజీహెచ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం యానాం-ద్రాక్షారామ రహదారిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరప మండలం అడవిపూడి గ్రామానికి చెందిన కోట శ్రీరామ్(21) కాకినాడ ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై యానాం-ద్రాక్షారామ రోడ్డులో వెళ్తుండగా ఇంజరం వద్ద వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. దీంతో యువకులకు తీవ్రగాయాలయ్యాయి. కోట శ్రీరామ్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మరో విద్యార్థి చికిత్స పొందుతున్నాడు. అయితే సుంకరపాలెం ఎక్సైజ్ చెక్‌పోస్టు అధికారులకు ఆ యువకులు మద్యం తరలిస్తున్నారన్న అనుమానం వచ్చి వారి వెంటపడిన కారణంగా యువకులు వేగంగా వెళ్లి లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని, అధికారుల నిర్లక్ష్యంతో నిండుప్రాణం బలైపోయిందని బంధువులు శనివారం రాత్రి సుంకరపాలెం చెక్‌పోస్టును ముట్టడించి యువకుడి మృతికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కోరంగ పోలీసులు కేసు నమోదుచేశారు.

ఆరో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- రంప మన్యం ఆశ్రమ పాఠశాలలో ఘటన
- ఆరా తీసిన ఎమ్మెల్యే శిరీషదేవి
- విచారణకు ఆదేశించిన కలెక్టర్


మృతిచెందిన గిరిజన విద్యార్థిని

రంపచోడవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం వాడపల్లి ఆశ్రమోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న దోరి అశ్విని(11) శనివారం పాఠశాల అనుబంధ వసతిగృహంలోనే ఆత్మహత్యకు పాల్పడింది. దీని వివరాలిలా ఉన్నాయి. ఈ పాఠశాలలో ఉదయం అల్పాహారం తీసుకున్న అనంతరం వసతిగృహంలోకి వెళ్లి చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందిందని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తెలిపారు. హుటాహుటిన విద్యార్థినిని వాడపల్లి ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందిందని ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా సదరు విద్యార్థిని తన ఆత్మహత్యకు కారణాలను వివరిస్తూ ఒక లేఖను కూడా రాసి విడిచిపెట్టినట్టు తెలుస్తోంది. విషయం తెలిసిన వెంటనే రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి వాడపల్లి ఆశ్రమ పాఠశాలకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ఇతర విద్యార్థినులతో మాట్లాడి సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఇటువంటి సంఘటనలు బాధాకరమని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీడియాలో ఈ గిరిజన విద్యార్థిని ఆత్మహత్య ఘటన ప్రసారం అవుతుండడంతో అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్ తక్షణం స్పందించి విచారణకు ఆదేశించారు. అనంతరం రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పాఠశాలకు వెళ్లి ప్రాథమిక విచారణ జరిపారు. అత్యవసరంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ ఘటనపై రంపచోడవరం పోలీసు స్టేషన్‌లో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదై దర్యాప్తు ప్రారంభమైంది. గిరిజన బాలిక మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.


పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

రూ.58 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో 7 ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించి తులబారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. మహిళా దినోత్సవం, రెండవ శనివారం సెలవు కావడంతో వేలాది మంది భక్తులు వాడపల్లి తరలివచ్చారు. సుమారు 60వేల మంది స్వామిని దర్శించుకోగా 25వేల మంది అన్నప్రసాదం స్వీకరించిన్నట్టు అధికారులు అంచనా వేశారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.58 లక్షల ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారిని విశాఖ జిల్లా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. స్వామివారి చిత్రపటాన్ని ఈవో అందించారు.


ఆలయంలో పోటెత్తిన భక్తులు


వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి


పెందుర్తి ఎమ్మెల్యే రమేష్‌బాబు కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

శృంగారవల్లభ స్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి గ్రామంలో తొలి తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవీ సమేత శృంగారవల్లభస్వామి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని సుమారు 20వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి రూ.3,55,197 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

బాలబాలాజీకి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తుల కోలాహలంగా మారింది. వేకువజామున అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అర్చకులు ఉభయ దేవేరులను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.3,36,594 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 5వేల మంది దర్శించుకుని నిత్యాన్నదాన పథకంలో 3వేలమంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు పేర్కొన్నారు.

నేటి నుంచి కోరుకొండలో.. నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

తీర్థానికి తరలిరానున్న భక్తులు

కోరుకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభం కానున్నాయి. పాల్గుణశుద్ధ దశమి ఆదివారం సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణతో కార్యక్రమాలు వైకానస ఆగమనం ప్రకారం ప్రారంభమవుతాయి. ఈనెల 10వ తేదీ సోమవారం ఒంటి గంటకు రథోత్సవం, రాత్రి 9 గంటలకు కల్యాణ మహోత్సవం. 11వ తేదీ మంగళవారం రాత్రి గరుడ వాహనంసేవ, 12వ తేదీ బుధవారం రాత్రి 7గంటలకు స్వామివారి సదస్యం, రాత్రి 9 గంటలకు హనుమద్వాహనంపై గ్రామోత్సవం, 13తేదీ గురువారం రాత్రి 8 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, శ్రీరంగరాజ స్వామి ఆలయంలో రాత్రి 8 గంటలకు రంగనాథ స్వామి కల్యాణం, 14వ తేదీ శుక్రవారం దేవుని కోనేరు వద్ద చక్రతీర్థం, సాయంత్రం ధ్వజ అవరోహణ, అద్దాల సేవ, ఊంజల సేవ, రాత్రి 9గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవం, 15వ తేదీ శనివారం రాత్రి స్వామి వారికి శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తీర్థానికి భక్తులు తరలి వస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానం దత్తత ఆలయంగా ఉన్న నరసింహ స్వామి మహోత్సవాలను కనుల పండువగా నిర్వహించాలని అన్నవరం ఆలయ వ్యవస్థాపక కుటుంబీకుడు ఐవీ రోహిత్ అధికారులకు సూచించారు. రంగరాజభట్టర్ స్వీయ పర్యవేక్షణలో వైఖానస ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవనకుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చకస్వాములు ఉత్సవాలు నిర్వహిస్తారు.


కోరుకొండ కొండపైన స్వయంభుగా వెలిసిన నరసింహస్వామివారు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నాగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు

గొల్లప్రోలురూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలం తాటిపర్తిలో ఉన్న అపర్ణా సమేత నాగేశ్వరస్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా స్వామికి శనివారం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం లక్షబిల్వార్చన, రుద్ర హోమం, మహదాశీర్వచనం జరిగాయి. ఆలయ వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిల ఆధ్వర్యంలో 15 మంది పండితులు ఈకార్యక్రమాలను జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

మహిళా స్వావలంబనకు కుట్టు శిక్షణ

» జిల్లాలో రూ.9.47 కోట్లతో శిక్షణా కార్యక్రమం » జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
» ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


రమణయ్యపేటలో ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల స్వయం స్వావలంబన కోసం ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం ఏర్పాటుచేసి తద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జిల్లా వ్యాప్తంగా కుట్టు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. జిల్లా కార్యక్రమంలో భాగంగా శనివారం కార్పొరేషన్ ఒకటో డివిజన్ రమణయ్యపేట కాపుల వినాయక కల్యాణ మండపంలో జిల్లా బీసీ తరగతులు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో బీసీ, కాపు, అగ్రవర్ణ పేద మహిళల ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కుట్టుశిక్షణా కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో రూ.9.47కోట్లతో 3,789మందికి ఉచిత కుట్టు శిక్షణ ఇస్తామన్నారు. 3 నెలల శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామని తెలిపారు. మహిళలు స్వయం స్వావలంబన సాధించాలనే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, కాపు, బీసీ, అగ్రవర్ణ పేద మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. మహిళా సంక్షేమం, అభివృద్ధే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ధ్యేయమన్నారు. కార్యక్రమాన్ని మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా సుస్థిరత సాధించాలని కోరారు. బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ కాళ్ల సత్తిబాబు, మాజీ కార్పొరేటర్ పేరాబత్తుల లోవబాబు, మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు, వెంకటరమణ, పాల్గొన్నారు.

●అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా నాయకులు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాలిక ఉషారాణి, పలివెల గాయత్రి, బొజ్జ భవాని తదితర నాయకులు పాల్గొన్నారు. స్థానిక పద్మానగర్ కాలనీలో స్థానిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధరంగాల్లో సేవలు అందిస్తున్న అడబాల పార్వతి, ఇంటి సూర్యాకాంతం, చింతలపూడి సరోజిని, వీఎల్ నరసమాం, కస్తూరిబాయిలను ఘనంగా సత్కరించారు. పరసా సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, ఎం. అజీజ్, మొహిద్దున్ , శ్రీనివాసరావు, బి. వెంకటరాజు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం: ఆధునిక యుగంలో మహిళలు అన్నిరంగాల్లో పట్టు సాధించి రాణించాలని పెద్దాపురం ఎమ్మె ల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏ సమాజమైతే మహిళను ఉన్నతంగా చూస్తుందో ఆ సమాజం అభివృద్ధి వైపు నడుస్తుందన్నారు. అనంతరం పలు రంగాల్లో రాణించిన మహిళలను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, పెద్దాపురం టీడీపీ పట్టణాధ్యక్షుడు రంధి సత్యనారాయణ పాల్గొన్నారు. స్థానిక రాజుగారి వీధిలో ఆర్య వైశ్య సేవా సంఘ భవనంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు తదితరులు పాల్గొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో మహిళా దినోత్సవం సందర్భంగా మండల లీగల్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కాకినాడ చైర్మన్ ధరణికోట మురళి, రాష్ట్ర న్యాయ విభాగం అధ్యక్షు డు వేదుల సుబ్రహ్మణ్యం, జిల్లా న్యాయవిభాగం అధ్యక్షు డు కందుల వెంకటాచలం పాల్గొన్నారు.

కార్పొరేషన్(కాకినాడ): మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) రాష్ట్రశాఖ సూచనల మేరకు జిల్లా అధ్యక్షుడు ఎండీ హలీమ్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సమాజంలో విశిష్ట సేవలందిస్తున్న పి.అనుపమ, సీహెచ్ గిరిజ, డాక్టర్ గుల్జార్ బానోషిరీ, జైబునా మొయినా, ఎండీ షర్మిలను సత్కరించి మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎండీ హలీమ్, షేక్ హుస్సేన్, ఎంపీజే సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కాకినాడ ఆర్టీసీ డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మహిళా సమాఖ్య కాకినాడ వైస్ ప్రెసిడెంట్ మీనాక్షిదేవి, ట్రెజరర్ పి.పద్మజావాణి హాజరయ్యారు. జిల్లాలోని కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోలకు చెందిన 14మంది సిబ్బందిని ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి వారికి నగదు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపో మేనేజర్లు ఎంయువీ మనోహర్, ఎస్.కిరణ్‌కుమార్, జీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అంతరిక్షంలోనూ పయనిస్తున్న నేటి మహిళలు

● ఎమ్మెల్సీ రాజశేఖరం

కాకినాడ సిటీ: నేటి మహిళలు అంతరిక్షంలోను పయనిస్తూ తమ శక్తిసామర్థ్యాలు నిరూపించుకుంటున్నారని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక గొడారి గుంటలో శనివారం యంగ్‌మైండ్స్ రేపటి కోసం సేవా సంస్థ, సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఫలపుష్ప, ముగ్గుల, ఆర్గానిక్ వంటల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రిపద్మశ్రీ, ప్రత్యేక ఆహ్వాని తులుగా కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని పాల్గొన్నారు. కార్యక్రమానికి యంగ్ మైండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ అధ్యక్షత వహించారు. అతిథులు ఫలపుష్ప ప్రదర్శన, ఇంటి వంటలు, టెర్రస్‌గార్డెన్ మొక్క లు సందర్శించారు. అనంతరం రాజశేఖరంను సత్కరించి చిత్రపటం బహూకరించారు. సుంకర తిరుమల కుమార్, కటకంశెట్టి బాబి, తిలక్‌బాబు, తోట కూరసాయిరామకృష్ణ, కృష్ణకుమార్, జయరాజు పాల్గొన్నారు.

వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ

స్థానిక 36వ డివిజన్‌లో సుమారు 100 మంది వృద్ధులు, వితంతువులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు ఇతరులపై ఆధారపడ కుండా స్వశక్తితో ఎదిగేలా సాధికారిత పొందా లన్నారు. మహిళా నాయకురాలు నల్లూరి తులసి మాట్లాడుతూ మహిళా సాధికారితతోనే వికసిత భారతం సాధ్యమన్నారు. టీడీపీ నాయకులు ఆకెళ్ల ప్రసాద్, ఉప్పు లూరి వీరభద్రరావు, కర్రి మహేష్, గుంటూరి అప్పలరాజు, పెమ్మాడ సాయిప్రసన్న, మధుశ్రీ పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం

వివిధ రంగాల్లోని మహిళలను శనివారం స్థానిక 17వ డివిజన్ జగన్నాథపురం ధనమ్మ గుడి వద్ద సత్కరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కాకినాడ నగర అధ్యక్షుడు బడే కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి గుత్తులరమణ అధ్యక్షత వహించారు.

విజేతలకు బహుమతుల ప్రధానం

కాకినాడ క్రైం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు ఎస్పీ జి.బింధుమాధవ్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బహుమతి ప్రధానంతోపాటు జ్ఞాపికలను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పాత్ర గురించి వివరిస్తూ విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నతి స్థితికి వచ్చి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు వారికి ఉన్న అనుమానాలను ఎస్పీ బింధుమాధవ్‌తో చెప్పి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కాకినాడ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావ్, మహిళా రక్షక్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప, వేళంగిలో మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

కరప : వేళంగి పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ సవిలే నీలిమ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న జి.సుజాత, గిడితూరి వీరవెంకటవిజయలక్ష్మి, ఇండియన్ లాయర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు తప్పెట్ల పృధ్విరాజ్ దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ముందుగా గౌతమ బుద్ధుడు, మహాత్మ జ్యోతిరావుపూలే దంపతులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, సవిలే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సవిలే రాజేష్, ట్రస్ట్ ఆఫ్ బొండా చైర్మన్ డాక్టర్ బొండా వెంకన్నరావు, వేళంగి హైస్కూల్ హెచ్ఎం కాశి భారతి, పంచాయతీ కార్యదర్శి సంతోష్, కుంచే సాంబమూర్తి, గుణ, ఎర్రా విక్రమ్‌పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండలంలో భీమాబాయి మహిళామండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్తన ఆధ్వర్యంలో మహిళాదినోత్సవంపై అవగాహన కల్పించి తాళ్లరేవు గ్రామంలో ర్యాలీ నిర్వహించి మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. కోరింగ పోలీసుస్టేషన్‌లో, దీరూబాయి అంబాని ఎర్లీవెంటర్ సెంటర్, ఉమా మనో వికాస కేంద్రం, తాళ్లరేవు ఆసుపత్రిలో, ప్రవేటు పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించి మహిళలను ఘనంగా సత్కరించారు.

మహిళా వైద్యులు, అధికారులకు సత్కారం

పిఠాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో మహిళా వైద్యులను, స్టాఫ్ నర్సులను, పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐ నగీనా, పిఠాపురంకోర్టులో ఏపీపీ లీల నాగరోజాలను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. పిఠాపురం మహిళా సాధికా సమాఖ్య సేవాసమితి ఆధ్వర్యంలో మహిళలకు నారీశక్తి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనం సత్యప్రియ, కొత్తప్రవీణ, ఉపాధ్యక్షురాలు కొత్త శ్యామల, గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, కేఎస్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో జనసేన పార్టీ నాయకురాలు డాక్టర్ వరలక్ష్మీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.


విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎస్పీ బింధుమాధవ్

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

మహిళా సంక్షేమానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా నాయకులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. అనంతరం లక్ష్మీదేవిని మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. పంపనబోయిన అన్నపూర్ణ పాల్గొన్నారు.

విధినిర్వహణలో సేవలు ప్రశంసనీయం

గొల్లప్రోలు: చిన్న వయస్సులోనే ఉద్యోగ బాధ్యతలు చేపట్టి విధి నిర్వహణలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారిణి అశ్వినితేజ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు అన్నారు. గొల్లప్రోలు పట్టణం గాంధీనగర్‌లోని వివేకానంద జ్ఞానమందిరంలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో అశ్వినితేజను సత్కరించారు. కార్యక్రమంలో స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, యోగా గురువు జ్యోతుల నాగేశ్వరరావు, కొమ్ము నాగేశ్వరరావు, చోడపునీడి పుల్లపురాజు, కర్రి కొండలరావు, పెదిరెడ్ల వెంకట్రాజు, కంకటాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామర్లకోట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వక్తలు మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పలు రుణ పథకాలు అంది స్తున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, చైర్‌పర్సన్ జీ.అరుణ తదితర మహిళా కౌన్సిలర్లను సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా సిబ్బంది, సీఆర్‌పీలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సామర్లకోట వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో ఘనంగా జరిపారు. వనిత క్లబ్ అధ్యక్షురాలు కంచర్ల సుష్మో మోహిని, కార్యదర్శి కంచర్ల మహాలక్ష్మి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యను సన్మానించారు. కటకం రత్నకుమారి, కంచర్ల లలిత, కటకం హైమావతి, కటకం పద్మరత్నం, సమత, పవన్, సుధీర్, నేతికుమార్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సత్కారం: సామర్లకోట మండలం వెంకట కృష్ణరాయపురం పంచాయతీ ఆవరణలో శనివారం ఎంపీడీవో కె.హిమమహేశ్వరిని ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, కుర్రా నారాయణస్వామి (రాజు)ల ఆధ్వర్యంలో సన్మానించారు. వీఏఏ శ్రీలక్ష్మి, పంచా యతీ కార్యదర్శి, జనసేన నాయకులు సూరి బాబు, బాబులు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ రాజశేఖరానికి చిత్రపటం బహూకరిస్తున్న దృశ్యం
పిఠాపురంలో వర్మ సతీమణి లక్ష్మీదేవిని సత్కరిస్తున్న మహిళా నాయకులు



కాకినాడలో మహిళామణులను, ఆర్టీసీలో ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జిలు

లోక్ అదాలత్‌లో 1527 కేసులు పరిష్కారం

కాకినాడ క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 1527 కేసులు పరిష్కారం అయినట్లు లోక్‌అదాలత్ చైర్మన్ పి.కమలాదేవి తెలిపారు. కాకినాడ కోర్టులో శనివారం 8 బెంచ్‌లు ఏర్పాటుచేసి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్ బెంచ్‌లకు న్యాయమూర్తులుగా నాలుగవ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, ఆరవ అదనపు జిల్లా జడ్జి నిఖిత, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయబాబు, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్నలక్ష్మి, మూడవ అదనపు జెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి, నాల్గవ అదనపు జెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ షేక్ షిరీన్, స్పెషల్ మొబైల్ జెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మికుమారి, స్పెషల్ జెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏ నాగమల్లేశ్వరి వ్యవహరించారు. 81 సివిల్ కేసులు, 301 క్రిమినల్ కేసులతో పాటు ఇతర కేసులను కలుపుకుని మొత్తం 1527 కేసులు పరిష్కారం చేశారు.

299 కేసులు పరిష్కారం

పిఠాపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 299 కేసులు పరిష్కారమయ్యాయి. మోటారు వాహన ప్రమాద కేసులు, సివిల్, క్రిమినల్, ఎన్ఐఏ కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించారు. 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వీవీ అపర్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

●టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

పిఠాపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పిఠాపురం పట్టణంలో ఉన్న పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 15వ తేదీ వరకూ జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని టీటీడీ టెంపుల్ ఇనస్పెక్టర్ సందీప్ కోరారు.

మహిళా స్వయం ఉపాధికి రుణాలు

గొల్లప్రోలు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన రుణాలు, సహకారాన్ని ప్రభుత్వం అందజేస్తుందని జనసేన పిఠాపురం నియో జకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో 16 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీలో భాగంగా రూ.2.75కోట్లు రుణాలను అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగరపంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక నాయకులు మమ్మల్ని కొట్టారు

కరప బీసీ గురుకుల విద్యార్థుల ఆరోపణ

కరప, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తమను కొందరు స్థానిక నేతలు కొట్టారని కరప మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఆరోపిస్తున్నారు. బయట వ్యక్తులు తమపై దాడి చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామంటున్నారు. దీనికి సంబంధించి బాధిత విద్యార్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరప బీసీ గురుకుల పాఠశాలలో కొందరు విద్యార్థులు అల్లరిచేస్తున్నారంటూ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు కరప పోలీసులకు మౌఖిక ఫిర్యాదు చేశారు. ఆ విద్యార్థులను మందలించాలని స్థానికంగా ఒక నాయకుడికి ఆయన చెప్పినట్టు తెలిసింది. దీంతో ఈనెల 4న ఉదయం ఇద్దరు నాయకులు, ఒక కానిస్టేబుల్ పాఠశాలకు వెళ్లి కొంతమంది పేర్లు చదివి ప్రిన్సిపాల్ గదికి పిలిపించారు. యూనిఫాం ఎందుకు వేసుకోలేదని, గంజాయి తాగుతున్నారా.. అని ప్రశ్నించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాళ్లొచ్చారంటూ ప్రిన్సిపాల్ బదులిచ్చారని విద్యార్థులు ఆరోపించారు. ప్రిన్సిపాల్ ఎదురుగా తమపై వారు దాడి చేయడంపై తీవ్ర మనోవేదనకు గురవుతున్నామన్నారు. దీనిపై ప్రిన్సిపాల్ రామకృష్ణారావును వివరణ కోరగా కొంతమంది విద్యార్థుల ప్రవర్తన బాగోలేదని, రాత్రివేళల్లో స్కూల్ భవనంపై మద్యం, సిగరెట్లు తాగుతున్నారని ఆరోపించారు. నూతనంగా నిర్మించిన షెడ్డు, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారన్నారు. విద్యార్థుల ఆగడాలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా దీనిలో భాగంగానే కానిస్టేబుల్ వచ్చారన్నారు. అదే సమయంలో పాఠశాలకు ఇరువైపులా గేట్లు పెడతామని ఇద్దరు స్థానిక నాయకులు వచ్చారన్నారు. ఈ క్రమంలో ఓ నాయకుడు విద్యార్థిపై చేయి చేసుకున్నాడన్నారు. మ్యాన్ హ్యాండిలింగ్ చేయొద్దని వారిని వారించినట్టు ప్రిన్సిపాల్ వివరణ ఇచ్చారు.

పెద్దాపురంలో అగ్నిప్రమాదం

పెద్దాపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజుగారి వీధిలో శ్రీనివాస నర్సింగ్ హోమ్ సమీపంలో ఉన్న ఓ ఇంట్లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచార పౌర సంబంధాల శాఖలో పనిచేసిన మాజీ విశ్రాంత ఉద్యోగి విలయత్ అలీ ఇంట్లో ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇంట్లో ఉన్న నాలుగు కరెంటు మీటర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. పెద్ద శబ్దాలతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న పిల్లలు, పెద్దలు బయటకు పరుగులు తీశారు. స్థానికులు ట్రాన్స్ ఫార్మర్ నుంచి వచ్చే కరెంటు సప్లయి నిలిపివేసి మంటలు ఆర్పారు. సుమారు రూ.2లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు తెలుస్తోంది.

రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావుకు సత్కారం


రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

కార్పొరేషన్(కాకినాడ), మార్చి8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ చైర్మన్, రెడ్‌క్రాస్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన కాకినాడ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావును కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ఘ నంగా సత్కరించారు. సిద్ధార్థనగర్‌లోని వైడీ రామారావు నివాసగృహానికి వెళ్లిన నాయకులు వైడీ రామారావు ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది కాకినాడకు, జిల్లాకు, రెడ్‌క్రాస్‌కు వారు అందించిన సేవలకు గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. విజయవాడలో రాష్ట్రశాఖ నూతన భవన నిర్మాణానికి రామా రావు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో నులకుర్తి వెంకటేశ్వరరావు, పెంకె శ్రీనివాసబాబా, కటకంశెట్టి బాబి, మల్లిపూడి వీరు ఉన్నారు.

స్వమిత్వ డ్రోన్ సర్వేతో ప్రజలకు యాజమాన్య హక్కులు

● డీపీవో రవికుమార్

సర్పవరం జంక్షన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గృహ యజమానులకు యాజమాన్య హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వమిత్వ పథకంలో డ్రోన్ చేపట్టిందని, సర్వే నిర్వహణ కోసం నిర్వహిస్తోన్న శిక్షణా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ కోరారు. శనివారం రమణయ్యపేట మండల కార్యాలయం సమావేశ మందిరంలో కాకినాడ డివిజన్ పంచాయతీ, రెవెన్యూ సర్వే, సచివాలయ సిబ్బందికి స్వమిత్వ డ్రోన్ సర్వేపై నిర్వహిస్తున్న ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామ కంఠాల్లో నిర్మించుకున్న ఇళ్లు, ఇళ్ల స్థలాలను ఇతరులకు విక్రయించే హక్కులేదన్నారు. డ్రోన్‌సర్వే ద్వారా ఇళ్లు గుర్తించి పంచాయతీ ఆస్తుల గుర్తింపు, పన్నుల ద్వారా ఆదాయం సమకూరడమే కాకుండా, ఇంటి యాజమానులకు ప్రభుత్వం ఇచ్చే యాజమాన్య హక్కు పత్రాలతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని చట్టబద్ధత పొందే బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని భవనాలు, చెరువులు రోడ్లు, కాలువలు ఖాళీ స్థలాలను డ్రోన్‌తో రోవర్ సర్వే చేయాలని కోరారు. ఈ సందర్భంగా సాంకేతిక పరిజ్ఞానం దావరా రోవర్ ద్వారా డ్రోన్ సర్వే ఎలా చేపట్టాలి, గ్రామ కంఠాలు గుర్తింపు, యాజమాన్య హక్కుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై రీసోర్సు పర్సన్లు అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శులు పిడుగు పాండు రంగారావు, పబ్బినీడి శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభకు తరలిరావాలి

● సమన్వయకర్త పీవీఎస్ఎస్ రాజు

పిఠాపురంరూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): చిత్రాడ శివారులో జరిగే జనసేన ఆవిర్భావ సభకు ప్రతిఒక్కరూ తరలివచ్చి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేస్తున్న కార్యక్రమాలకు అండగా నిలవాలని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, సభ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు కోరారు. సభను విజయవంతం చేయాలని కోరుతూ పిఠాపురం మండలం ఎల్ఎన్‌పురం, నరసింగపురం, గోకివాడ, జములపల్లి, బి.కొత్తూరు, తిమ్మాపురం, వెల్దుర్తి, పి.దొంతమూరు గ్రామాల్లో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుతో కలిసి శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రచారం నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, ప్రజలను కలిసి ఆవిర్భావ సభ కరపత్రాలు అందించి సభకు రావాలని ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తుమ్మలపల్లి చందు, ఊటా నానిబాబు, వెన్నపు చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.


జనసేన ఆవిర్భావ సభకు తరలిరావాలని ప్రచారం నిర్వహిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త రాజు

కవలల చికిత్సకు ఆర్థిక సాయం


కవల పిల్లల చికిత్సకు రూ.70వేల చెక్కునందిస్తున్న చేయూత టీం

కరప, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నెలలు నిండకుండా జన్మించి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కవల పిల్లలకు చేయూ త స్వచ్ఛంద సంస్థ రూ.70వేల ఆర్థికసాయం అందజేసింది. కరప గ్రామానికి చెందిన బుద్దాల వీరవిజయలక్ష్మి సత్యనారాయణ దంపతులకు ఇటీవలె కవల పిల్లలు జన్మించారు. ఏడు వారాలకే ఆమె జన్మనివ్వడంతో కవల శిశువులు పూర్తిగా ఎదగక ప్రాణాపాయ స్థితిలో వెంటిలేటర్‌పై చికిత్సనందిస్తున్నారు. ట్రీట్‌మెంట్‌కు రోజుకు రూ.70వేలు ఖర్చవుతుండడంతో నిరుపేద దంపతులు దాతల సాయంకోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న చేయూత టీం చిన్నారుల చికిత్స కోసం రూ.70వేలను బాధిత కుటుంబానికి అందజేసింది. కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు చేయూత టీంకు అభినందనలు తెలిపారు. చేయూత సంస్థ ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి, కార్యదర్శులు రవికుమార్, అలీమ్, సభ్యులు డేగల లక్ష్మి, పరసా ఝాన్సీ, శేషకుమారి, మాధవి, రమాదేవి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.


అవార్డు తీసుకుంటున్న గౌరీ

ఉత్తమ వీవోఏగా గౌరీ

గండేపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య పరిధిలో సూరంపాలెం గ్రామ సంఘంలో వీవోఏగా పనిచేస్తున్న మురారి గౌరీ ఉత్తమ వీవోఏ అవార్డును వెలుగు పీడీ చేతుల మీదుగా అందుకున్నారు. ఆమెను ఏపీఎం పి.సన్యాసిరావు, సిబ్బంది అభినందించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే శిరీషాదేవి ● పలుచోట్ల ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష


కూనవరంలో కేక్ కట్ చేస్తున్న ఎస్‌ఐ

రంపచోడవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళాభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. శనివారం రంపచోడవరంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్లో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇటీవల పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆమె అన్నారు. పీవో మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వాలు ఎన్నో సంస్కరణలను చేపట్టి, వారికి అన్ని రంగాలలోనూ సముచిత ప్రాధాన్యత ఇస్తుందన్నారు.సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు దేశాన్ని సైతం మంచి మార్గంలో నడిపించే స్థాయికి చేరుకున్నారన్నారు. అనంతరం మన్యంలోని సుమారు 4753 మహిళా సంఘాలకు రూ211 కోట్ల రుణాల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా అందజేశారు.

చింతూరు: చింతూరులో ఐద్వా, సీఐటీయూ, ఉపాధ్యాయ, వైద్యరంగాలతో పాటు వివిధశాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు పాల్గొని మహిళా సాధికారితపై చర్చించారు. మహిళల రక్షణకోసం పొందుపర్చిన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు.

కూనవరం: మహిళాభివృద్ధితోనే సమాజానికి మనుగడ ఉంటుం దని కూనవరం ఎస్‌ఐ లతాశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పలుచోట్ల శనివారం నిర్వహించారు. కూనవరంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్‌ఐ లతాశ్రీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్త్రీ అభివృద్ధితోనే సమాజ మనుగడ, పురోగతి ఉంటుందని, ప్రపంచ అభివృద్ధి కూడా మహిళల అభివృద్ధితోనే ముడిపడి ఉంటుందన్నారు. మహిళా సాధకారత అంటే మహిళలు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం ద్వారా అభివృద్ధిలో ముందుకు సాగడమేనన్నారు. కార్యక్రమంలో సోడే లక్ష్మి, ఏసుమణి, ధనలక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తొలితరం మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిఫూలే చిత్రపటానికి మండల అటవీశాఖాధికారి గుమ్మడి ఉషారాణి, ఎంఈవో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్, సీఐటీయు ప్రజా సంఘాల నేతలు విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళలకు పలు రకాల ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉషారాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కోడూరి లోవరాజు, బీరబోయిన వెంకటలక్ష్మి, చోడి రాధ, తాడే వీరవెంకటప్రసన్న, మిరియాల సత్యవతి, చోడి జోగరత్నం, తీగల నూకరత్నం, రెడ్డిలక్ష్మి పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం ఏపీ జెన్కో లోయర్ సీలేరు సీనియర్ అకౌంట్ ఆఫీసులో ఓఎండమ్, సివిల్, అకౌంట్ ఆఫీస్ లోయర్ సీలేరు మహిళా ఉద్యోగులు మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నారని, రాబోయే రోజుల్లో మహిళలు సాధించలేనిది అంటూ ఏమీ ఉండదన్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఆటపాటలతో గడిపారు.

ఎటపాక: స్థానిక విద్యావనరుల కేంద్రం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి తహశీల్దార్ కారం సుబ్బారావు విచ్చేసి మాట్లాడారు. వివిధ శాఖల్లోని మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో సరియం రాజులు, జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, గొమ్ముకొత్తగూడెం ఎంపీటీసీ పాయందేవీ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: స్థానిక ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అడ్డతీగల ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారిని ప్రసన్నను, ప్రధానోపాధ్యాయురాలు శాంతిమతిని సన్మానించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తేజోరావు, అధ్యక్షుడు శ్రీనివాసరావు, కోశాధికారి దొరబాబు, లోవరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అడ్డతీగల పోలీసుస్టేషన్ ఆవరణలో సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన మహిళా పోలీసులను సన్మానించారు. అనంతరం స్థానిక పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి దేవిసెంటర్ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వినోద్, కాంగ్రెస్ నాయకులు దంగేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: మండలంలోని రేఖపల్లిలో ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో యూటీఎఫ్,సీఐటీయూ,మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరుపుకున్నారు. యూటీఎఫ్ మహిళా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షురాలు మాట్లాడుతూ సమాజంలో నేటికి మహిళలపై చిన్నచూపు ఉందని, ఎన్ని చట్టాలు వచ్చినా వరకట్న వేధింపులు, అత్యాచార సంఘటనలు తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ కారం లక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల వివక్షత కొనసాగుతూనే ఉందన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సాంప్రదాయ ఆటపాటలు జరుపుకున్నారు. రేఖపల్లిలోని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు ఆధ్వర్యంలోనూ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

దేవీపట్నం: కచ్చులూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్రకృతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీడబ్ల్యు సహకారంతో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంపచోడవరం పీఎంయు నుంచి చంద్రకళ హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో కొమరం పోచమ్మ, చినరమణయ్యపేట ఎంపీ టీసీ సోడే లక్ష్మికుమారి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.


వీఆర్‌పురంలో మాట్లాడుతున్న మహిళలు


కేక్ కట్ చేస్తున్న జెన్‌కో ఉద్యోగులు

తాటాకిల్లు దగ్ధం

వై.రామవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వై.రామవరంలో సంతమార్కెట్ వీధిలో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించి పూరేడు అంజి, ఆదమ్మ దంపతులు నివసిస్తున్న తాటాకిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్టుసర్క్యూట్‌తోనే ప్రమాదం సంభవించినట్టు స్థానికులు తెలిపారు. రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లినట్టు అంచనా.


తేటగుంటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య


ప్రత్తిపాడులోని కోర్టు వద్ద జడ్జిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

● ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రత్తిపాడు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కోర్టువద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, కార్యదర్శి మణిబాబు, న్యాయవాదులు ఇన్‌చార్జ్ మేజిస్ట్రేట్ లీలా శ్యామ్ సుందరి శాలువా కప్పి సన్మానించారు. ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య కేక్ కట్ చేసి మహిళా వైద్యులు, సిబ్బందికి పంపిణీ చేశారు. మండలంలోని వెంకటనగరం, చింతలూరు, పాండవులపాలెం, లంపకలోవ గ్రామాల్లో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో, అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం కార్యకర్తలు మహిళలపై వేధింపులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు అరికట్టాలని ర్యాలీలు నిర్వహించారు. పాదురుపాకలో బీజేపీ నాయకులు సింగిలిదేవ్ సత్తిరాజు, కించుజోగిరాజుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం వద్ద పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను, పార్టీ కార్యకర్తలు మహిళలకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో...

శంఖవరం: మహిళా దినోత్సవాన్ని స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివిధ పోటీలను నిర్వహించారు. విజేతలకు నాబార్డ్ డిడియమ్ సోమనాయుడు, యాళ్ల పద్మలత బహుమతులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ అధ్యక్షురాలు అనూష, రత్నశ్రీ, స్వరాజ్య, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గండేపల్లి: గండేపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఎస్‌ఐ శివనాగబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు సన్మానం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో పోటీ పడుతున్నారన్నారు. ఎన్నో రంగాల్లో మహిళలు సేవలందిస్తున్నారన్నారు. సూరంపాలెం ఆదిత్య విద్యాప్రాంగణంలో మహిళా సిబ్బందిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసినట్టు యూనివర్శిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు ఆధ్వర్యంలోవేడుకలు నిర్వహించారు.

జగ్గంపేట: జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో మహిళా వైద్యులు, స్టాఫ్‌నర్సులు, మహిళలు, సిబ్బందికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కేట్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. జగ్గంపేట శివారు స్టాలిన్ భవన్ నందు ప్రగతిశీల మహిళా సంఘం వేడుకలు నిర్వహించగా మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.శాంతి హాజరయ్యారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వి.చిట్టిబాబు, ఎన్.వరదరాజు, ఎస్.రామిరెడ్డి, క్రైబాపనమ్మ పాల్గొన్నారు. ఏపీఆర్‌సీఎఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగ్గంపేట షాదీఖానా అండ్ ఉర్దూఘర్ హాల్లో మహిళాసభ నిర్వహించారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్ డొక్కులూరి సంగీత అధ్యక్షత వహించారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ప్రధానవక్తగా పాల్గొని భారీ ప్రదర్శన నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, పీడీఎస్‌యుపీ రాష్ట్ర నాయకులు కడితే సతీష్, ప్రగతి శీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) జిల్లా నాయకులు చింతపల్లి రత్నం, నాగమణి అక్క, కొమ్మిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు. జగ్గంపేట మండలం రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీరామ్, ఎంపీహెచ్‌ఈవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ పూజ, పీహెచ్ఎస్ లక్ష్మీకాంతం, నర్సులు, ఏఎన్ఎంలు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జగ్గంపేట మండలం గోవిందపురంలో సీపీఐ ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున రావు హాజరయ్యారు. కోరుకొండ మరిడమ్మ, రొంబ్బల సంకురమ్మ, గుమ్మడి దేవి, బూరుగు గంగ, సోమలక్ష్మి పాల్గొన్నారు.

ఏలేశ్వరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పట్టణంలో నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, మహిళలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపాలకృష్ణ నేతృత్వంలో స్థానిక ప్రభుతావసుపత్రిలో మహిళా వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి వైద్యులకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు.

కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్: తేటగుంట క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వెలమ కొత్తూరు మాజీ సర్పంచ్ తమరాన వరలక్ష్మి, బోనంకి లక్ష్మి, తమరాన రామలక్ష్మి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, యనమల దివ్య కేక్ కట్ చేశారు. సీనియర్ జర్నలిస్టు పసగడుగుల రాంబాబు ఆధ్వర్యంలో తుని ప్రెస్ క్లబ్ తరుపున యనమల దివ్యకు మెమోంటో బహూకరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు దేవవరపు కృష్ణార్జునరావు, ప్రవీణ్ చక్రవర్తి, సాగర్, లోవరాజు, పప్పు గంగాధర్ పాల్గొన్నారు.


రాజపూడి పీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ పూజ


గండేపల్లి: మహిళా పోలీసులకు సన్మానం చేస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు మోహనరావు, ఎస్‌ఐ శివనాగబాబు

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరసన

ఏలేశ్వరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద శనివారం ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో కార్మికులు ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన కొనసాగించారు. జేఏసీ నేతృత్వంలో 6వ రోజు జక్కా శ్రీను, బి.ఎస్.రావు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. డ్రైవర్ ఎస్వీ రమణపై అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని భోజన విరామ సమయంలో కార్మికులు నిరసన తెలియజేశారు. ఏన్ఎమ్‌యూ కార్యదర్శి కె.త్రిమూర్తులు, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి యు.బి.ఎమ్ కుమార్, ఎన్‌పి రావు, తదితర కార్మికుల మద్దతు తెలియజేశారు.

రూ.5.35 కోట్లతో తారురోడ్ల నిర్మాణం

కిర్లంపూడి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో రూ.5.35కోట్లతో తారురోడ్లు నిర్మిస్తున్నట్టు జిల్లా పంచాయతీరాజ్ సూపరిండెంట్ ఇంజనీరింగ్ అధికారి ఎవి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మండలంలో సింహాద్రిపురం నుంచి భూపాలపట్నం, వీరవరం వెళ్లే రహదారి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 3మండలాల్లో రోడ్డు నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ శాఖ డీఈ ఉమాశంకర్, ఏఈ నారాయణ, కాంట్రాక్టర్ రమేష్, సిద్దు ఉన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

ప్రత్తిపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో నిరుద్యోగ యువకులు గళ్ళా ప్రకాష్, అడపా కృష్ణలు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను శనివారం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. నానిపల్లి చంటి, జువ్వల దొరబాబు, జువ్వల సత్యనారాయణ, యాళ్ళ ఏసు, శామ్యూల్, శేఖర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే

రైతుల ఖాతాల్లో నగదు జమ

● మంత్రి నాదెండ్ల మనోహర్

గండేపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామ శివారున పరిణయ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి జనసేన ఆవిర్భావ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కౌడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో జిల్లా మొత్తం గండేపల్లి మండలంలో ఉన్న గ్రావెల్‌పై కన్నేశారని అభివృద్ధి కోసం ఆలోచించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. చిత్రాడలో జనసేన ఆవిర్భావ సభకు పెద్ద ఎత్తున రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రోగ్రామింగ్ కమిటీ జాయింట్ కన్వీనర్ తుమ్మలపల్లి చందు, జనసేన నాయకులు బుదిరెడ్డి శ్రీను, రామకుర్తి నరసింహం, సూరంపాలెంబాలు, శివ, అయిరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల


ప్రత్తిపాడు కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

లోక్ అదాలత్‌లో 243 కేసులు పరిష్కారం

ప్రత్తిపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఇన్‌చార్జ్ జడ్జి లీలాశ్యామ్‌సుందరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆ అదాలత్‌లో 243 కేసులు పరిష్కారం అయ్యాయి. వీటిలో సివిల్ కేసులు5,ఎక్సైజ్ 61, ఐపీఎస్ కేసులు 42, గృహహింస, మనోవర్తి కేసులు ఉన్నాయి. బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, మాజీ అధ్యక్షుడు బుగతా శివ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు ఎమ్మెల్యే శ్రీకారం


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తుని నియోజకవర్గాన్ని ప్రగతి పథం వైపు నడిపిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య శనివారం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్‌కు శ్రీకారం చుట్టారు. ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. ఉదయం 9 గంటల ఒంటిగంట వరకు అధికారులతో కలిసి ఎమెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. తొండంగి, తుని, కోటనందూరు, మండలాలతో పాటు తుని నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించిన దివ్య కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కరించగా మిగిలిన సమస్యలపై పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కారం కాని సమస్య అంటూ ఏదీ ఉండకూడదని, జిల్లా స్థాయికి వెళ్లే సమస్యలను సంబంధిత అధికారులతో చర్చిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

వేంకటేశ్వరస్వామి తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు


తిరునాళ్లకు సిద్ధమవుతున్న వెంకటేశ్వరస్వామి ఆలయం

గండేపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో తాళ్ళూరు గ్రామంలో కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా శతాబ్దాల చరిత్ర కలిగిన వేంకటేశ్వరస్వామిగా తిరునాళ్ల సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. వేల సంఖ్యలో భక్తులు, వీఐపీలు, రాజకీయ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశాలు ఉండడంతో ఆలయ ఈవో ఉనమట్ల రాజేష్, కమిటీ సభ్యులు దాపర్తి సీతారామయ్య ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద చలువ పందిళ్లతో పాటు క్యూలైన్లకు ఏర్పాటు చేశారు. గజేంద్రపుష్కరిణిలో వేలాదిమంది భక్తులు స్నానాలు చేసే అవకాశం ఉండడంతో పాత నీరు తీసి కొత్త నీరు నింపారు. ఆలయ చుట్టుపక్కల శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. గజేంద్రపుష్కరిణి వద్ద గజ ఈతగాళ్లను ఉంచామన్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచే స్వామి వారి తిరునాళ్ల ప్రారంభమవుతాయని ఈవో తెలిపారు.

‘ఆదిత్య’లో ఘనంగా సప్తమ వార్షికోత్సవం



గండేపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వేదిక జ్ఞాన సరస్వతీదేవి, షిర్డీసాయి బాబా ఆలయాల సప్తమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. శ్రీరామ్‌శర్మ, ప్రసాద్ శర్మల వేదోక్తమంత్రాలు నడుమ కార్యక్రమాలు జరిగాయి. ఆదిత్య యాజమాన్య కుటుంబసభ్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ

అన్నవరం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయాలనికి తీసుకెళ్లారు.


స్వామి, అమ్మవార్లకు తిరుచ్చిసేవ చేస్తున్న దృశ్యం

యాగం ఏర్పాట్ల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న దృశ్యం

ఎటపాక, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉష్ణగుండాల వద్ద ఈనెల 12వ తేదీ నుంచి 23 వరకు నిర్వహించనున్న అష్టలక్ష్మి యాగానికి సంబంధించి ఏర్పాట్లను ఆ పీఠం వ్యవస్థాపక ఆచార్యులు పీతాంబరం రఘునాథాచార్యులు, ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, కమిటీ సభ్యులు శనివారం పరిశీలించారు. సుమారు 50 మంది వేదపండితులతో ప్రతిరోజూ నిర్వహించే యాగంలో ప్రజలు పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. ఇక్కడకు వచ్చే భక్తులకు అన్నదానం, వసతి ఉంటుందని వివరించారు.

ఆదివాసీ యువతకు శిక్షణ తరగతులు

అడ్డతీగల, మార్చి8(ఆంధ్రజ్యోతి): స్థానిక వనంతరం కార్యాలయ ఆవరణలో ఆదివాసీ యువతకు బయోచార్ తయారీపై శిక్షణ ఇచ్చినట్టు కోఆర్డినేటర్ బుల్లయ్య తెలిపారు. రైతాంగానికి ఇబ్బందులు కలిగిస్తున్న కలుపు మొక్కలతో బయోచార్ తయారీ, వినియోగంపై రెండురోజుల పాటు శిక్షణ ఇచ్చామన్నారు. పులికంప గాలిగోపురం, వయ్యారిభామ వంటి కలుపు మొక్కలు ఆదివాసీ రైతులను పలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ఏటా ఈ మొక్కలను తీయించడానికి రైతులు వేలాది రూపాయలు వెచ్చిస్తున్నారని చెప్పారు. ఇటువంటి కలుపు మొక్కలకు బయోచార్ ఉపయోగించడం వల్ల తక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువుగా ఉపయోగ పడుతుందన్నారు. శిక్షణకు వై.రామవరం, అడ్డతీగల మండలాల నుంచి 60 మంది యువత హాజరయ్యారన్నారు.

రంపచోడవరంలో..

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు

రంపచోడవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ప్రారంభించారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీలతో కలిసి రంపచోడవరం పీఎంఆర్‌సీలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని వారితో కలిసి ప్రారంభోత్సవం చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో ఎటువంటి రిజిస్ట్రేషన్లు సాగించాలన్నా .. కోరుకొండకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై మన్యం వాసులకు ఆ అవసరం ఉండదని, ఈ కార్యాలయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

అక్రమంగా చేపలు పడితే జరిమానా


అక్రమంగా తరలిస్తున్న చేపలను పట్టుకున్న అధికారులు

దేవీపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపికొండలు అభయారణ్యంలో గోదావరి నదిపై అక్రమంగా చిన్నచేపలు వేటాడితే జరిమానా విధించనున్నట్టు అధికారులు హెచ్చరించారు. కొంతకాలంగా మండలంలోని పాపికొండలు అభయారణ్యంలో మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన కొంతమంది వేటగాళ్ల చిన్నచేపలు వేటాడి ఇతర రాష్ట్రాలకు తరలించుకుపోతున్నారు. వేటాడి తరలిస్తున్న ఈ చేపలను శుక్రవారం రాత్రి రెవెన్యూ, ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకుని దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ చేపలను మత్స్యశాఖ అధికారులకు అప్పగించినట్టు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.